# బడిపంతులు పరాకు

* శ్రీ పి. వి. యస్. మూర్తిరాజు బి. యే. బి. యిడి. *

ఆరోజు ఒక శనివారం. వచ్చేవారంలో స్కూలు యినస్పెక్షను జరుగుతుందని ప్రధానోపాధ్యాయుల వారునోటీసు పంపించడం మూలాన్ని కాంపోజిషను వగైరా వ్రాతపనులు సవరించే రజకవ్యవహారాల్లో బకాయిలు తీర్చేసి, మార్కుల రిజిష్టర్లు, పాఠాలకి సంబంధించిన నోట్సు మొదలైనవన్నీ సరిచెయ్యాలనీ సదుద్దేశాల్తో మామూలుకంటే ఒక అరగంటముందుగాలేచి కాలకృత్యాలుతీర్చుకుని దంతధావనానంతరం పైపుక్రింద స్నానానికూర్చున్నా. మా రజని ఎప్పుడులేచిందో తెలియదు. స్నానం చేస్తూండగానే పైపుదగ్గిరికొచ్చి "త్వరగా కానియ్యండి— కాఫీ చల్లారిపోతుంది" అంది. ఇదేమిటిచెప్మా! నా అవసరం తను కూడా గుర్తించినట్టుంది.— శలవురోజైనా నాతో సమంగా నిద్రలేచిందనుకున్నా. తొందరగా స్నానం సంధ్య ముగించుకు నేసరికి కాఫీగ్లాసుయెదట బడింది. ఒకగుక్కెడు కాఫీ త్రాగేను.

"కాస్త, ఒక్క అరగంట అంది" రజని ప్రాధేయక పూర్వకంగా "ఏమిటి. చేరం" అన్నా.

"ఏంలేదూ, ఇవాళ శనివారం, కాస్త తలరుద్దుకోవాలి. చంటిపిల్లని..."

'ఈ చంటిపిల్లని' అనేసరి. నాకు తెలియకుండానే చేతులోంచి కాఫీగ్లాసు కిందపడిపోయింది.

"ఏం చేద్దాం లెండీ, నేర్చుకుపోయారు. మరీను?" అంది దవడలు నొక్కుకుంటూ.

ఒళ్ళో యేడు పీరీడ్లు పనిచేసి మూడువందల మంది సమాధానంగా కూచోపెట్టుకొని ఒక్క చంటి పిల్లని సమాధానపర్చి యేడవకండా అరఘడియకూడా కూచోపెట్టడం మొగాడన్న వాడితరంకాదని చెప్పడంలో అనుమానం కించత్తుకూడా లేదు — పైగా నేనారోజుకు వేసుకున్న కార్యక్రమం యేమిటి? యీ విఘాతం యేమిటి? 'ప్రధమకబళే' అన్నట్టుగా నాకేం బోధపడలేదు. ఏమని సమాధానం చెప్పాలో అని ఆలోచిస్తున్నా ఇంతలో గ్లాసుమళ్ళీ కాఫీతో నిండింది. కాఫీతాగుతూ ఆలోచన ప్రారంభించా. అసలే బడిపంతులికి పరాకెక్కువ, అందులోను రెండుపనులు ఒకమాటు చెయ్యడం కష్టం ఆలోచన తెగలేదు. కాఫీచల్లారిపోయింది.

"ఒక్క అరగంటే కాదుటండీ యెందుకంత ఆలోచన?"

"మీ ఆడాళ్ళ అరగంటలు అయిదేసి నిమిషాలూ మాకు తెల్సు. మీది దేవమానం పిల్లనప్పగించి పన్నెండయ్యేదాకా కనబడవ్."

"ఒట్టు. ఒక్కరగంటంటే ఒక్కరగంటే కావలస్తే గడియారం చూసుకోండి." అని బతిమాల్తాన్నట్టు మాట్లాడింది. నేను తటపటాయిస్తున్నా."

మా సంభాషణంతా వింటూ అవతల కూచుని మొహం కడుక్కుంటూన్న బాజ్జీ పనిముగించుకొచ్చి "పోనీలేవే అమ్మా పాపాయిన్నే సెత్తుకుంటా" అన్నాడు. పంచభక్ష్య పరమాన్నాల్తో క్షుదార్తుడికి భోజనం పెడితే యెంత సంతోషంగా వుంటుందో అంత సంతోషం అయింది. మాబాజ్జీ అలా అనేసరికి వాళ్ళమ్మకి తెలియకుండా సాయంకాలం వాణ్ణి కాఫీ

హోటలుకి తీసికెడదామనికూడా మనస్సులో అనుకున్నా ఆపదకి అడ్డుపడినందుకు. అయితేయేం? 'తానొకటి తలచిన దైవమొకటితలచు'.

"ఏడిశావ్, వెధవా చదువుమానేసి యేపని చెయ్యమన్నా సిద్ధం. చదువంటే యేడుపు. పాపాయి నెత్తుకోమని యిప్పుడు నిన్నెవరడిగారు? ఎత్తుకోమన్నప్పు డేడుస్తావ్. పో, లెక్కలుచేసుకో మేడమీదికిపోయి. మొన్న పరీక్షలో లెక్కల పేపర్లో సున్నొచ్చింది. నీకూసిగ్గులేదు. ఆయనికీ సిగ్గులేదు." అని వాడిమీద వురిమిందితల్లి. ఆహుంకరింపుతో కాస్తకాఫీపుచ్చుకుని బాబ్జీమేడెక్కాడు.

ఆరోజుని చంటిపిల్లని నాకుతప్ప యింకెవరికి అప్పగించే వుద్దేశంలో లేదని నేను స్థిరంచేసుకుని ఐనా మరొక్కమాటు "చంటిదాన్ని యెలాగేనా నిద్రపుచ్చి నువ్వు తలంటుకోకూడదూ, ఇవాళ శనివారం వంటకి తొందరలేదు, అన్నా. "మీరుచేసే వుద్యోగానికే మలిగిపోయి, ముంచుకుపోతూన్న తొందరపన్లేమున్నాయ్ ? ఏ స్నేహితులింటికేనా వెళ్లవలసున్నా, క్లబ్బుకి వెళ్లవలసున్నా ఒక్కరగంట వాయిదా వేసుకోవచ్చు—ఇవాళ శనివారం ఆఫీసరన్న వాడిక్కూడా వుండదు, మీకున్నంత తొందర ఆనేసింది"—నాబడిపంతులు వుద్యోగంలోకువకని పెట్టి. "ఇవాళ యెక్కడికీవెళ్ళను. ఒచ్చేవారం డి. యి. ఓ. ఇనస్పెక్షనుంది అందుకొంచెం చేసుకోవలసిన యేర్పాట్లున్నాయ్" అన్నా.

"పాపం! ఒక్కరగంట నేనుపిల్లని చూస్తోండమంటే ఇనస్పెక్టర్లని, డైరెక్టర్లని, మంత్రుల్నిరప్పించేస్తారు. మొన్న నోమాటూ యిలాగే, పక్కింటికి పేరంటానికెళ్ళొస్తా, చంటిది వుయ్యాలాలో నిద్రపోతూంది చూస్తోండమంటే, ఎవడో మంత్రి ఒస్తాడని దయచేశారు—పిల్లనికన్నందుకు భారం అంతా నాదే అన్నట్టుగానున్నూ, మీదేం..."

ఇహాతుపాను రేగుతూన్న సూచనలు కనిపించాయి. ఎలాగా పిల్లనెత్తుకోవడం తప్పదు. వాదప్రతివాదాల్తో కాలవిలంబన. మనస్పర్థలు ఇత్యాది లఘు గృహచ్ఛిద్రాలకి తావివ్వడం యెందుకని పిల్లని ఎత్తుకోవడానికొప్పుకున్నా మేడెక్కుతూన్నంతసేపు పెద్దపిల్ల (ఎనిమిది) చంటిదాన్ని తనెత్తుకుంటానని వెనకాముందూపడ్డం మొదలెట్టింది. అప్పుడే చంటి



దాన్ని దానిచేతికిస్తే యిద్దరూకలిసి కిందపడతారేమో అని, గదిలోకెళ్ళాక యిస్తానన్నా. ఈసంభాషణ రజని విన్నట్టుంది. వెంటనే కిందనుంచి ఇందూ అని ఒకమాటు గర్జించింది. ఇందు కిందకి వెళ్ళిపోయింది. డాబామీదకూచుని బాబ్జీలెక్కలు చేసుకుంటున్నాడు. కొంచెంసేపు ఇటూ, ఆటూ తిరిగి చంటిపిల్లని పరుపుమీద పడుకోపెట్టా. ఈలోపుని ఇందుకూడా వొచ్చి దానిపక్కనిచేరి ఆడించడం మొదలెట్టింది.

గాలివానకొంచెం వెలిసిందనుకుంటూ కాంపోజిషను పుస్తకాలకట్టవిప్పి ఒకరచన దిద్దుతున్నా. మావిద్యార్థుల రచనలు చూస్తోంటే ఒక్కొక్కప్పుడు ఒక్కొక్కడిక్షనరీ తయారుచేసేవాడిలా కనిపించారు. ఇంతమంది జాన్‌సన్‌లుంటే దేశానికేంలోటు లేదనుకున్నా. వాళ్ళరాతలన్నీ చూస్తోంటే నేను వాళ్ళకి పాఠం చెప్పాలో, వాళ్ళు నాకు పాఠం చెప్పాలో అనేఆలోచన్లో పడవలసొచ్చింది. ఇలా తర్కించుకుంటూండగా రెండోపిల్ల ఉష (ఆరేళ్లది) కూడా పైకొచ్చి చంటిపిల్ల పక్కనిచేరింది. యేడవకండా చక్కగా ఆడుకుంటూన్న చంటిపిల్లని ఆడుకోనివ్వరుకదా యీ పెద్దాళ్ళిద్దరూను! చంటిపిల్లని లేవతీసి ఎత్తుకుంటానంటుంది ఉష. ఒద్దంటుంది ఇందు ఉష చంటిదాన్ని లేవతిస్తే దాన్ని తిరిగి ఇందులాక్కోవంలో మెడ బెణికినట్టుంది గొల్లుమంది చంటిది. చేతులో వున్నకలం. పుస్తకం బల్లమీద వదిలేసి చంటిపిల్లని నేనందుకున్నా—తదుపరి అక్కచెల్లెళ్ళిద్దరికీ వాక్‌యుద్ధం, అనంతరం కొట్టుకోవడం వరకు వెళ్ళడం, బాబీవచ్చితన్ని డిస్టర్బ్ చెయ్యొద్దని ఇద్దరినీ చెరోలెంపకాయకొట్టడం, చంటిపిల్లతోపాటు వాళ్ళుకూడా ఆరునొక్క రాగం ఆలాపన చెయ్యడం జరిగాయి.

"ఏమిట్రా ఆగొడవ?" అంటూ రజని పైకొచ్చింది.

"అప్పుడే అయిపోయిందా తలంటుకోవడం?" అన్నా అమాయికంగా.

"ఏం చిత్రంఅండీ, చిత్రమా అనీ. దానీ ముండరాలేదాయె. చెంబులూ, గిన్నెలు తోముకోవాలా? నీళ్లు కాచుకోవాలా? కుంకుడుకాయలు కొట్టుకోవాలా?"

"తెలుకులాడింటికి నూనెకొకర్ని, నున్ని పిండి విసిరించుకు రావడానికి మిల్లుకి యింకొకళ్ళని పంపాలా?"

"ఆ! పిల్లనెత్తుకోమంటే పిండైపోతున్నారు కాని, తెలుకులాడింటికీ, మిల్లుకికూడా వెడుతారు, మహా మీకున్న శాంతానికి తోడు."

"నువ్వన్న అరగంట అయిపోయి అయిదు నిమిషాలైంది"

"బాగా నేవుంది మీవరస చూస్తే. ఇదేం కుర్రాళ్లురాసే పరీక్షటండీ, టైమయిపోయిందని హెచ్చరించేటందుకు?" అంది.

చంటిదానికిపాలిస్తూ పిల్లలయేడుపులు వాటంతటవే ఆగిపోయాయి. మరికొంత సేపటికి రజని క్రిందకి వెళ్ళిపోయింది.

"చూడండి ఓనాన్నా, అక్క యెక్కిరిపింతుతూంది" అన్నది ఉష.

"ఏమే ఇందూ, ఏంపనది?" అన్నా.

"లేదండి నన్నుగిల్లిందండి."

నాకు వొళ్లుమండి "వెధవగొడవా మీరూను. నామతి పోగొడుతున్నారు. ఒనే, ఇందూ కాసేపు పుస్తకం చదువుకో. ఉషా, కిందకిపోయి అమ్మదగ్గిరుండు" అన్నా.

"అమ్మ నన్ను మీదగ్గిరే వుండమందంటే" అని వెంటనే సమాధానం యిచ్చింది ఉష, తల్లి మాట జవదాటడానికి వీల్లేనట్టు. ఇదికూడా సహించి వూరుకున్నా.

ఇందు చదువు మొదలెట్టింది. బాజ్జి లెక్కలు చేసుకుంటున్నాడు. ఇంతవరకూ ఒక్క వ్యాసంకూడా దిద్దలేదు.

"నాన్నగోయ్, అయిదూబైతరు, యేడూ బైయొనిమిది, తొమ్మిదిబైపదవారు, వీట్లని ఆరోహణ క్రమంలో రాయడం యెలాగా?" అంటూ పుస్తకం పట్టుకొని దగ్గిరకొచ్చాడు.

"మీ మేష్టారు చెప్పలేదుట్రా" అన్నా వినుగుతో.

"చెప్పారుకాని, నాకర్థంకాలేదు"

"నాన్నా, నాకు లోలకులు ఎప్పుడు చేయిత్తారు?" అంది ఉష.

క్షీ

"మరి నాకు బంగారపు గాజులో" అంది ఇందు.

"నాకు బూటు కొనిపెట్టరు నాన్నారూ" అన్నాడు బాబ్జీ అప్పుడే ఆపైరెండూ కొనేసినట్టు వాడికి కావలసింది కొననట్టుగా.

కోపంతోను, విసుగుతోను వుక్కిరిబిక్కిరి అయిపోతూ. "వెధవా, లెక్క చెయ్యడం ఎలాగని నన్నడగొచ్చి కుర్రముండల్తో సమంగా యీ బేరాలేమిటి?" అని ఒకటి తగిలిచ్చా పిర్రమీద. దాంతో వాడూరుకుని లెక్క చేసే విధానం తెల్సుకున్నాడు. వాడికి లెక్క బోధపరుస్తూన్నంతసేపూ ఆడపిల్లలు మాట్లాడలేదు. వాడు వెళ్లి మళ్ళీ లెక్కలు చేసుకుంటూండగా మొదలెట్టారు. లోలకులు కావాలనీ, గాజులు కావాలనీ, లోలకులూ, గాజులూ అంటే బజార్లో అడగ్గానే కొనితెచ్చే మిఠాయిపొట్లాలనే వాళ్ళ వుద్దేశం, ఏదో సమాధానం చెప్పబోతూంటే క్రిందనుంచి "ఇదుగో, వీధులో పొట్లకాయలమ్ముతున్నాడు. ఓజతకొనండి, తలంటుకుంటున్నా" అని హుకుమ్. చేస్తూన్నపని కట్టిపెట్టి విధిలేక మేడదిగినా ఆపొట్లకాయలమ్మేవాడు సందుమళ్ళి మాయమయ్యాడు. వాడేయింట్లో కళ్యాణో కనిపెట్టడం నాపనికాదు, వెనక్కొచ్చేసి. మేడమెట్లెక్కుతూ ఆసంగతి స్నానంగదిలో వున్న రజని చెవులో పడేశా.

ఈలోపులో అప్పచెల్లెళ్ళమధ్య ఇంకో దుమారం రేగింది. తనకిముందు గాజులు చేయిస్తారని ఇందు అందిట.—కాదు, తనకే ముందు లోలకులు చేయిస్తారని ఉష అందిట. దూషణపర్వం ప్రారంభ అయింది. ఇంతలో నేనొచ్చా. లేకపోతే ఇద్దరి వీర రౌద్రరసాలు ప్రత్యక్షమయ్యేవి. వీళ్ళగొడవలో చంటిపిల్ల గొల్లుమంది. విసుక్కుంటూ దాన్ని ఎత్తుకుని సముదాయించటానికి ప్రయత్నించా. అబ్బే! నాతరమా? మనమాట వినదు, వినబడదు,—ఎత్తుకుంటే అమాంతంగా కిందపడేలాక్కూడా కనిపించింది. పాలబుడ్డి తీసుకొచ్చి నోటిదగ్గరపెట్టినా లాభంలేదు. ఏ తేలేనా అంటపొడిచిందేమో అని కూడా అనుమానంవేసింది. ఈసందర్భంలో హిష్టరీ చదువుతూ మాబాబ్జీ "నాన్నారోయ్, షాహిమాన్ అంటేయెవరు?" అన్నాడు.

"ఎవడోసన్యాసి, పోదూ." అన్నా, యేడుస్తూన్నపిల్ల చేతులో వుండగా.

"అంటే మీబర్లో నొఖరుసన్యాసా?" అంది ఇందు.

"కాదే సన్నాసంతే, సన్నటిమనిషే" అని ఉష వ్యాఖ్యానం చేసింది.

చంటిపిల్ల వూరుకోవడంలేదు. "తరువాత చెపుతాలేరా బాబ్జీ" అనివాణ్ని తాత్కాలికంగా వొదుల్చుకున్నా. ఏకారణంచేతనో చంటిపిల్లఏడుపు మానింది. దాన్ని పడుకోపెట్టి నాపనిప్రారంభిద్దామనుకున్నా. ఇంతలోనే మళ్ళీ క్రిందనుంచి ఇంకొక ఆర్డరు "ఈమాటేనా త్వరగా మేడదిగి ఆనీరొంకాయలకావిడి పిలవండి. లేకపోతే యివాళ కూర వుండదు". బోర్లాపడకుండా మేడతొందరగాదిగి ఆ నీరొంకాయలుకొని మేడెక్కుతున్నా—యుద్ధంలో గెల్చినవాడిలాగ. స్నానాల గదిలోంచి మళ్ళీ రజని "వాడిదగ్గిర పచ్చిమిరపకాయలుకూడా వున్నట్టున్నాయి. వోపంపు పుచ్చుకోండి."

లోపల విసుక్కుంటూ పచ్చిమిరపకాయలు కొని పైకొచ్చికూచున్నా. రజని యింట్లోకొచ్చి పిల్లని తీసుకునేవరకు నాస్వంత వ్యవహారాలు చక్కబెట్టుకో దల్చుకోలేదు.

"చూడండి, చిన్నగుడ్డ కట్టుకున్నా. పాలవాడు తొందరచేస్తున్నాడు. ఆపాలు పోయించుకోండి" అనిమరో ఆజ్ఞ.

"నీధోరణిచూస్తే చివరకి పొయ్యిలోకూడా నన్నే నిప్పెయ్యమని చెయ్యికాల్చుకోమనేటట్టున్నావ్ ఇవాళ" అనిఅంటూ, దిగివచ్చి పాలుపోయించుకున్నా. రజని బట్టకట్టుకు బయలుపడింది. అప్ప

టికి టైము తొమ్మిదిన్నర. పిల్లలంతా తల్లిచుట్టూ చేరారు,

"ఓమాటు బజారికెళ్లొలండిమీరు" అంది రజని చెవులకి దుద్దులు పెట్టుకుంటూ.

"చంపేశావ్. ఇంతవరకూ వీళ్ళతోటయింది. టైమంతా. ఇప్పుడిహ బజారికెళ్ళి పూటంతా వ్యర్థం చెయ్యమంటావా?"

వ్యర్థం అంటే యెలాగండీ వుప్పు లేదు, మిరపకాయ లేవు, చింతపండు లేదాయిరి, ఇంకదేంతో వొండను?"

"బజారికి నేనూ లావొద్దు నాన్నా" అంది వుష.

"నేనూ వస్తా నాన్నా" అంది ఇందు.

"వెడదాం నాన్నరూ" అని బాబ్జీ అంటూనే వెళ్లి బండి లాక్కొచ్చాడు. వీడితస్సాచక్కా. ఆ బండివాడు నిలబడడు. "బాబయ్యా త్వరగా రండి. తిరిగొచ్చి సోంబాబుగార్ని టేసనుకి తీసికెళ్లాలి" అంటాడు వాడు.

సరేఅని పైమీదకండువా, జేబులో పర్సు వేసుకుని పిల్లలతోసహా బండెక్కా, తోవలో కాఫీ హోటలు కనిపించింది. బలవంతాన్ని బండాపించారు పిల్లలు. అందరం కాఫీహోటల్లో పడ్డాం. ఇంటికి కట్టించిన పొట్లాలతోసహా రూపాయన్నర బిల్లు చెల్లించి బయటపడ్డా. ఇంతలో కాఫీహోటలు కెదురుగావున్న దయాల్బాగ్ జోళ్ళదుకాణం తెరిచాడు.

"నాన్నారోయ్! ఆబుల్లి బూటు చూడండి. ఎంత బాగుందో మనఉషకి యెంతో బాగుంటుంది" అన్నాడు బాబ్జీగాడు. ఉష అందుకుంది, "ఊఁ... ఊఁ... నేలానంతే నాకు జోలుకొనండి" అని హోటలు అరుగుమీద కూచునిపోయింది. "రండి బాబయ్యా, యెల్లిపోవాల"ని బండివాడి తొందర.

"తరవాత కొంటాలేవే ఉషా" లాభంలేక నోడు కొంటేనేకాని కదలదని భీష్మించుకూచుంది. జోళ్ళదుకాణంలోకెళ్ళాం. పాపం చాలా చాలామర్యాద చేసికూచోపెట్టి పిల్లలందరి కాళ్ళూ పట్టుకుని తలోజత అమిర్చాడు అక్కడున్నసత్సంగి. ఎంత అని అడిగేసరికి గుండెగుభేలు మనేలాగ "Fifteen six six" అన్నాడు. బేరం ఆడడం వాడి యెదుట వెర్రిమొహం వెయ్యడం నాగరికతా లక్షణం కాదనుకుని అంతసొమ్ము చెల్లించి గుమ్మందిగా.

"ఇదేటిబాబయ్యా. ఇంతాలస్యం నేనసలు రానంటూంటే అబ్బాయిగారు తీసుకొచ్చారు." అని బండివాడు తోకతొక్కిన తాచులా లేచాడు. పిల్లలుజోళ్ళ అడావిడిలో వున్నారు. ఎండ చుర్రుమంటోంది అప్పటికే. ఒళ్ళంతా చెమటలు పోశాయ్, నేనుకూడా బండెక్కి "సరే తోలెయ్యరా" అన్నా పరధ్యాన్నంగా ఒక్కగంతులో బండి యింటిముందాగింది.

పిల్లలు సంతోషంతో దిగి ముందు పరుగెత్తుకెళ్లి తల్లికిజోళ్లు చూపిస్తున్నారు. నేను బండి దిగగానే డబ్బులు తర్వాతవచ్చి తీసుకుంటానని బండివాడు వెళ్ళిపోయాడు. ఇంట్లో అడుగుపెట్టి రజనిమొహం చూచేసరికి గుండెల్లో రాయిపడింది. అసలు బజారుకెందుకెళ్లానో ఆపని జరగనేలేదు. నాచేతుల్లో టిఫిను పొట్లాలుచూచి,

"బెల్లంమాట మర్చిపోయానండీ" అంది.

"నేనన్నీ మర్చిపోయా. వెధవతొందరా పిల్లనూ— కుర్రవెధవలు మాట్లాడనియ్యరు తోచనియ్యరు. పైగా ముంచుకుపోయినట్టు ఆబండి వెధవొకడు దాపరించాడు శనిలాగ."

"అయితే యీ పొట్లాలేమిటి?"

"నీకు ఇడ్డెన్లు అవీను."

"మీకు మతిపోయినట్టుంది, ఇవాళ శనివారం కాదూ, నాకు? ఇవన్నీ యేంజేసుకోను?"

"ఏదో బడిపంతులు పరాకులే."